క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు



మనుబోలు : మనుబోలులో పెద్ద చెరువు గట్టుపై ఉన్న గంగమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

సనాతన ధర్మం వర్ధిల్లాలి జాగృత సభ రేపు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఆదివారం సాయంత్రం 5గంటలకు ''సనాతన ధర్మం వర్ధిల్లాలి'' జాగృత సభ నిర్వహిస్తున్నట్లు సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఔత్సాహిక గాయకులతో హైందవ ధర్మ భక్తి గీతాలాపన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. పలువురు ఆలయ అర్చకులను సత్కరించనున్నట్లు తెలిపారు. భక్తి గీతాలాపనలో పాల్గొనే గాయకులు 78938 47709 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

న్యాయవాదుల నిరసన



మాట్లాడుతున్న ఉమామహేశ్వర్, సుందరయ్య

నెల్లూరు (లీగల్): కోర్టులో పిటిషన్‌కు రూ.1 స్టాంపుతో పాటు మరో రూ.20 స్టాంపు వేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఏపీ ఉత్తర్వులు జారీ చేయడానికి నిరసనగా నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ప్రాంగణంలో బార్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్య మాట్లాడుతూ ఇప్పటికే కక్షిదారులు ఇబ్బందులు పడుతుండగా పిటిషన్లకు వేసే స్టాంపు విలువ పెంచడం తగదన్నారు. బార్ అసోసియేషన్‌ల ఆమోదం లేకుండా ఏక పక్షంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. బార్ అసోసియేషన్ ట్రెజరర్ రమేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

• జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

ఇందుకూరుపేట : అందరికి ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం అని ఎంపీడీఓ నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని పల్లిపాడులో శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్య సేవలను వివరించారు. అనంతరం శిబిరానికి వచ్చిన డాక్టర్లకు వివధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వసుధర, స్థానిక నాయకులు గూడూరు జయరామయ్య, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : పల్లిపాడులో వైద్య పరీక్షలకు క్యూలో ఉన్న గ్రామస్తులు

కనుపర్తిలో..

పొదలకూరు : మండలంలోని కనుపర్తి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను శుక్రవారం నిర్వహించారు. గ్రామానికి చెందిన వారు విశేషంగా తరలివచ్చారు. మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు పర్యవేక్షణలో క్యాంపును ఏర్పాటు చేశారు. హెల్ప్‌డెస్క్ ద్వారా క్యాంపునకు వచ్చిన రోగులను వలంటీర్లు, సిబ్బంది వైద్యనిపుణుల వద్దకు తీసుకెళ్లారు. సర్వేలో అందజేసిన టోకెన్ల ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సలు చేయిస్తామని వెల్లడించారు. ఈ క్యాంపులో డాక్టర్ కిరణ్‌రిషిత, వైద్యనిపుణుడు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య ఆంధ్రప్రదేశ్' లక్ష్యంగా..

తోటపల్లిగూడూరు : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని ఎంపీడీఓ హేమలత పేర్కొన్నారు. సౌత్‌ఆములూరు సచివాలయ పరిధిలోని సౌత్‌ఆములూరు, ముంగళదొరువు గ్రామాలకు సంబంధించి సౌత్‌ఆములూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ హేమలత హాజరై, మాట్లాడారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఈ క్రమంలో పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తోందన్నారు. కుటుంబంలో ఎవరికైనా చిన్నపాటి అనారోగ్య సమస్యలున్నా ఈ క్యాంపుల ద్వారా మంచి వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో సుమారు 500 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేంద్రతో పాటు ఇతర వైద్యులు రజనీకుమారి, పుంచలప్రసాద్‌లు పాల్గొని వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు చెరుకూరు శ్రీనివాసులునాయుడు, స్థానిక సర్పంచ్ చెరుకూరు సరళమ్మ, ఎంఈఓ–2 జయరామనాయుడు, పాఠశాల హెచ్‌ఎం షేక్ అహ్మద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట : జగనన్న సురక్ష కిట్‌లను అందజేస్తున్న ఎంపీడీఓ నాగేంద్రబాబు



తోటపల్లిగూడూరు : సౌత్‌ఆములూరులో జగనన్న సురక్ష క్యాంపును పరిశీలిస్తున్న అధికారులు



పొదలకూరు : వైద్య పరీక్షలు చేస్తున్న మహిళా డాక్టర్



పొదలకూరు : మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



తోటపల్లిగూడూరు : సురక్ష క్యాంప్‌ను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

అభివృద్ధి, సంక్షేమమే సీఎం ధ్యేయం



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం చివరిరోజు కార్యక్రమాన్ని మండలంలోని మైపాడు తూర్పుపాళెంలో ఆయన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోవూరు నియోజకవర్గ పరిధిలో 204 రోజుల పాటు గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని వివరించారు. తన తండ్రి నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి ట్రస్ట్ ద్వారా పలువురికి అండగానూ నిలిచామని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుండడంతో ఏ గడపకు వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. రాష్ట్రం మరింత ముందుకు పోవాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని శాశ్వత ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. గడపకు గడపకు కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించేందుకు సహకరించిన ప్రతిఒక్కరికీ ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ఎంపీడీఓ నాగేంద్రబాబు, డీటీ బషీర్, సీఐకే రామకృష్ణారెడ్డి, పార్టీ నేతలు శ్రీహరికోట ప్రసాద్, పామంజి నరసింహ, కూనంగారి రమణయ్య, కనుపూరు సురేంద్రబాబు, సర్పంచ్ సంగం వెంకయ్య, సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కొడవలూరు: మండలంలోని మానేగుంటపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎముకలు, కీళ్ల, కంటి వైద్య నిపుణులతో పాటు జనరల్ ఫిజీషియన్లు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలైనా శిబిరంలో పరీక్షించి సంబంధిత వైద్యశాలలో చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముత్తుకూరు: మండలంలోని నేలటూరు గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రత్యూష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ వైద్య నిపుణులు వైద్యసేవలు అందించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడతాం

• సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

పొదలకూరు : ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రైవేటీకరణకు వంతపాడుతున్న కేంద్ర ప్రభుత్వాన్ని పాదయాత్రలో ఎండగడతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి అన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి సీపీఎం పాదయాత్రను మండలంలోని విరువూరులో శుక్రవారం ఆమె ప్రారంభించారు. సాయంత్రం పొదలకూరు చేరుకుని బస్టాండ్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రం ప్రైవేటీకరణ పేరుతో అదాని, అంబానిలకు ప్రభుత్వ రంగ సంస్థలను కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. అందులో భాగంగానే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అదానికు అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. సీపీఎం జిల్లా నాయకుడు చంద్రా రాజగోపాల్, మండల కార్యదర్శి బీ మనోహర్, సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విరువూరులో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

సమస్యల పరిష్కారానికి చర్యలు

• ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్) : సిబ్బంది సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నెల్లూరు నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఎస్పీ సంక్షేమ దివాస్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా పలు సమస్యలను సిబ్బంది ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై తక్షణమే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

• పోలీసులకు ఫిర్యాదు

వెంకటాచలం : అదనపుకట్నం కోసం భర్త మహేష్‌తో పాటు అత్త, మామలు వేధిస్తున్నారని మండలంలోని గొలగమూడి గ్రామానికి చెందిన ఏగిరెడ్డి భువనేశ్వరి వెంకటాచలం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. గొలగమూడి గ్రామానికి చెందిన భువనేశ్వరికి మనుబోలుకు చెందిన ఏగిరెడ్డి మహేష్‌తో మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం ఇచ్చినా మరోసారి అదనపు కట్నం కోసం భర్త మహేష్, అత్త, మామలు సుదర్శనమ్మ, జయరామయ్య, ఆడపడుచు అరుణ మానసికంగా, శారీరకంగా వేధిస్తూ ఇంటి నుంచి గెంటేశారని ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

కొడవలూరు: రైతు భరోసాకు అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటి వరకు రైతు భరోసా మంజూరు కాని రైతులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ ఖాతా, ఆధార్‌తో ఆర్బీకేలోని వీఏఏను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలో పలువురి చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : మండలంలోని గంగవరం పంచాయతీ ఒకటో వార్డు సభ్యురాలు రజిత కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ఆమె ఈ సందర్భంగా తెలిపారు. రజితతో పాటు పలువురు వ్యక్తులు వైఎస్సార్‌సీపీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, సర్పంచ్ లక్ష్మీకుమారి, మండల సచివాలయ కన్వీనర్ కవరగిరి ప్రసాద్, వైస్ సర్పంచ్ మోషే, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసులురెడ్డి, మస్తాన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శనివారం పొదలకూరులో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ టీ నగేష్‌కుమారి శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు సీహెచ్‌సీలో అదనపు ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం ఏసీ కాలనీలో రూ.20 లక్షలు, జూనియర్ కళాశాల వద్ద రూ.45 లక్షలు, గడప గడపకు నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రెయిన్లను ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్సార్ నిధులు రూ.22 లక్షలతో ఆధునికీరించిన గదులను ప్రారంభిస్తారని వివరించారు. గేటు సెంటరులో ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

మనుబోలు: రైతులందరూ ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏఓ షేక్ జహీర్ సూచించారు. శుక్రవారం ఆయన మనుబోలు రైతు భరోసా కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పంటలు సాగుచేసిన రైతులు ఈ-క్రాప్‌ను తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు, పంట బీమా పొందాలంటే తప్పనిసరిగా ఈ-కేవైసీ, ఈక్రాప్ నమోదు చేసుకోవాలని కోరారు.

ఎంఈఓ తనిఖీలు



కొడవలూరు : మండలంలోని రామన్నపాళెం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ-1 జీ వసంత కుమారి శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులు రాసిన నోటు పుస్తకాలను ప్రతిరోజూ ఉపాధ్యాయులు పరిశీలిస్తున్నారా..లేదాని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం ఎస్కే గౌస్‌బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

